జావా 42 ఎఫ్‌జే బైకు

ప్రారంభ ధర రూ.1.99 లక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 17: ప్రీమియం మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ జావా యెజ్డీ మోటర్‌సైకిల్..తాజాగా మరో మాడల్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ బైకులను పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన 350 జావా 42 ఎఫ్‌జేను అందుబాటులోకి తీసుకొచ్చింది. నాలుగు రకాల్లో లభించనున్న ఈ బైకు రూ.1.99 లక్షల నుంచి రూ.2.23 లక్షల మధ్యలో లభించనున్నది. ఈ సందర్భంగా జావా యెజ్డీ కో-ఫౌండర్ అనుపమ్ తరేజా మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో 12 షోరూంలు ఉండగా, వచ్చే ఏడాది కాలంలో మరో 3 షోరూంలను కొత్తగూడెం, గద్వాల్, షాద్‌నగర్‌లలో ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 8 షోరూంలను నెలకొల్పబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

ఈపీఎఫ్‌వో సభ్యులకు శుభవార్త

- **అధిక బీమా ప్రయోజనం పొడిగింపు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పథకం కింద ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో)లోని సభ్యులందరికీ గతంలో పెంచిన బీమా ప్రయోజనాలను పొడిగిస్తున్నట్టు గురువారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా ప్రకటించారు. దీంతో ఉద్యోగ భవిష్య నిధి ఈపీఎఫ్‌వోలోని 6 కోట్లకుపైగా సభ్యులకు రూ.7 లక్షలదాకా జీవిత బీమా కవరేజీ రానున్నది. ఈ కవరేజీ పొడిగింపు ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచే వర్తిస్తుందని కూడా ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మంత్రి స్పష్టం చేశారు. ఈడీఎల్ఐ స్కీంను 1976లో ప్రారంభించారు. ఈపీఎఫ్‌వో సభ్యులు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతనిచ్చేలా బీమా ప్రయోజనాలను ఇందులో కల్పించారు. అయితే 2021 ఏప్రిల్ 28న వచ్చే మూడేండ్లకుగాను ఈ పథకం కనీస బీమా కవరేజీని రూ.2.5 లక్షలకు, గరిష్ఠ బీమా కవరేజీని రూ.7 లక్షలకు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 27తో ఆ వ్యవధి పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి తాజా ప్రకటన వచ్చింది. దీంతో ఏప్రిల్ 28 తర్వాత మరణించిన ఈపీఎఫ్‌వో సభ్యులకూ ఇకపై అధిక బీమా ప్రయోజనం దక్కనున్నది. ఇదిలావుంటే కంపెనీలో వరుసగా 12 నెలల సర్వీస్ ఉన్నవారికి ఈ బీమా వర్తిస్తుందన్న నిబంధననూ సడలించారు. ఉద్యోగాలు మారినా బీమా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ బీమాకు సంబంధించి ఉద్యోగుల తరపున కంపెనీలే చెల్లిస్తాయి.

బైజూస్ విలువ సున్నా: రవీంద్రన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ విలువ ఇప్పుడేమీ లేదని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్రన్ అన్నారు. గురువారం వర్చువల్‌గా జరిగిన విలేకరుల సమావేశంలో బైజూస్ మళ్లీ పుంజుకుంటుందా? అన్న ప్రశ్నకుగాను బైజూస్ విలువ ప్రస్తుతం సున్నా అని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. గత ఏడాది ఒకేసారి బైజూస్ ప్రధాన ఇన్వెస్టరైన ప్రోసస్, పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్, చాన్ జూకర్‌బర్గ్ ఇనీషియేటివ్‌ల సంస్థ బోర్డు నుంచి వైదొలగడం పెద్ద దెబ్బగా రవీంద్రన్ అభివర్ణించారు. ఈ క్రమంలోనే నిధుల సమీకరణ అసాధ్యంగా మారిందని చెప్పుకొచ్చారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ బోధనా మాధ్యమంగా వేగంగా విస్తరించిన బైజూస్.. అత్యంత విలువైన భారతీయ స్టార్టప్ ఘనతను సాధించింది. అయితే మళ్లీ విద్యా రంగంలో సాధారణ పరిస్థితులు రావడం, ఆన్‌లైన్ చదువులకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో బైజూస్ సేవలకు డిమాండ్ కరువైంది. ఈ నేపథ్యంలోనే ప్రోసస్ వంటి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను నిరర్థకంగా ప్రకటించారు. 'అమెరికాకు చెందిన రుణదాతలు సంస్థను ఎగవేతదారుగా ప్రకటించి, కోర్టుల్లో పిటీషన్లు దాఖలు చేసినప్పుడు రెండు వారాల వ్యవధిలోనే ముగ్గురు డైరెక్టర్లు కంపెనీకి రాజీనామా చేశారు. వారు తప్పుకున్నా.. సంస్థ పునర్వ్యవస్థీకరణ దిశగా అడుగులు వేస్తే కంపెనీకి నేడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు' అన్న అభిప్రాయాన్ని రవీంద్రన్ ఈ సందర్భంగా కనబర్చారు.

6 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్ల నష్టాలతో భారీగా మదుపరుల సంపద పతనం

సెన్సెక్స్ 495, నిఫ్టీ 221 పాయింట్లు క్షీణత • అమ్మకాల ఒత్తిడిలో బ్యాంకింగ్, ఆటో షేర్లు

ముంబై, అక్టోబర్ 17: దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. వరుసగా మూడోరోజూ సూచీలు కోలుకోలేకపోయాయి. గురువారం ఒక్కరోజే మదుపరుల సంపద రూ.6 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. ఉదయం ఆరంభం నుంచే ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 494.75 పాయింట్లు లేదా 0.61 శాతం దిగజారి 81,006.61 వద్ద ముగిసింది. ఈ ఏడాది ఆగస్టు 21 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఇక ఒకానొక దశలోనైతే 595.72 పాయింట్లు పడిపోయి సెన్సెక్స్ 80,905.64కు చేరింది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 221.45 పాయింట్లు లేదా 0.89 శాతం దిగి 24,749.85 వద్ద స్థిరపడింది.

ఆకట్టుకోని ప్రధాన షేర్లు

బేరిష్ ట్రెండ్ నేపథ్యంలో ప్రధాన రంగాల షేర్లేవీ కూడా మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్ నష్టాలకే పరిమితమయ్యాయి. విదేశీ మదుపరులు తమ పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేయడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే మార్కెట్లకు నష్టాలు తప్పలేదని మెజారిటీ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. బుధవారం విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) రూ.3,435.94 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారని స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలూ నష్టాల్లోనే ఉన్నాయి.

తరిగిపోతున్న మార్కెట్ క్యాప్

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.6,03,862.06 కోట్లు కరిగిపోయి రూ.4,57,25,183.01 కోట్ల (5.44 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. సెన్సెక్స్ షేర్లలో నెస్లే అత్యధికంగా 3 శాతానికిపైగా క్షీణించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మారుతీ, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లూ నిరాశపర్చాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.65 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.42 శాతం పతనమయ్యాయి. రంగాలవారీగా రియల్టీ 3.76 శాతం, ఆటో 3.48 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 2.28 శాతం, కమోడిటీస్ 1.77 శాతం, చమురు-గ్యాస్ 1.54 శాతం నష్టపోయాయి.

> *ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించడం, ఎఫ్ఐఐలు పెట్టుబడులను అదేపనిగా వెనక్కి తీసుకుంటుండటం, ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికిగాను ప్రధాన సంస్థలు ప్రకటిస్తున్న ఆర్థిక ఫలితాలు నిరాశపరుస్తుండటం మార్కెట్ వరుస నష్టాలకు దారితీస్తున్నది.*
>
> *-సిద్ధార్థ ఖేమ్కా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రిసర్చ్ హెడ్*

హ్యుందాయ్ ఐపీవో సక్సెస్

హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా తీసుకొచ్చిన భారీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఎట్టకేలకు విజయం సాధించింది. మూడు రోజుల ఈ పబ్లిక్ ఇష్యూ.. గురువారంతో ముగియగా, ఆఖరి రోజున ఇన్వెస్టర్ల నుంచి విశేష స్పందన లభించింది. రూ.27,870 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా ఈ నెల 15 (మంగళవారం)న మొదలైన ఈ ఐపీవోకు తొలి రెండు రోజుల్లో 42 శాతం సబ్‌స్క్రిప్షనే వచ్చింది. అయితే చివరి రోజు మదుపరులు పోటెత్తడంతో మొత్తంగా 2.37 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఈ మేరకు ఎన్ఎస్ఈ వెల్లడించింది. ఫలితంగా ఇప్పటిదాకా ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ రూ.21,000 కోట్ల ఐపీవో పేరిట ఉన్న అతిపెద్ద ఐపీవో రికార్డు.. ఇప్పుడు హ్యుందాయ్ సొంతమైంది. కాగా, క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) నుంచి అధిక డిమాండ్ రావడం వల్లే హ్యుందాయ్ ఐపీవో సక్సెస్ అయ్యింది. షేర్ల కోసం 6.97 రెట్లు ఎక్కువగా బిడ్డింగ్ వేశారు. రిటైల్ ఇండివీడ్యువల్ ఇన్వెస్టర్ల నుంచి 50 శాతం, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి 60 శాతం సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. సోమవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,315 కోట్ల నిధులను హ్యుందాయ్ సమీకరించిన సంగతి విదితమే.

విప్రో 1:1 బోనస్ షేరు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.3,208.8 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,646.3 కోట్ల కంటే 21.2 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.22,516 కోట్ల నుంచి రూ.22,301 కోట్లకు పడిపోయింది. మరోవైపు సంస్థ షేరుహోల్డర్లకు శుభవార్తను అందించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు మరో షేరును బోనస్‌గా అందిస్తున్నట్లు ప్రకటించింది. రికార్డు తేది నాటికి అర్హత కలిగిన ఈక్విటీ వాటాదారులుగా ఉండాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పల్లె మాట్లాడుతూ..ఆదాయ, బుకింగ్, మార్జిన్లలో అంచనాలకుమించి రాణించినట్లు చెప్పారు. బిలియన్ డాలర్ల కంటే అతిపెద్ద ఒప్పందాలు కుదుర్చుకున్నటు చెప్పారు.

ఇన్ఫోసిస్ లాభం 6,506 కోట్లు

- **క్యూ2లో 5 శాతం పెరిగిన ప్రాఫిట్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవలం సంస్థ ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను(జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో) రూ.6,506 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,212 కోట్ల లాభంతో పోలిస్తే 4.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. తొలి త్రైమాసికపు లాభంతో పోలిస్తే 2.2 శాతం పెరుగుదల కనిపించింది. సమీక్షకాలంలో కంపెనీ రూ.40,986 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఏడాది ప్రాతిపదికన ఆదాయంలో 4.2 శాతం వృద్ధి నమోదైంది.

మరోసారి గైడెన్స్ పెంపు

ఆదాయ అంచనాలో వృద్ధిని మరోసారి పెంచింది ఇన్ఫోసిస్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి తొలి త్రైమాసికంలో 3-4 శాతం మధ్యలో ఆదాయ వృద్ధి ఉంటుందని అంచనావేసిన సంస్థ..రెండో త్రైమాసికంలో దీనిని 3.75 శాతం నుంచి 4.50 శాతం మధ్యలో ఉంటుందని పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 1-3 శాతం మధ్యలో ఉంటుందని గతంలో అంచనావేసింది. అతిపెద్ద ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్లనే ఆదాయ అంచనాలను సవరిస్తున్నది సంస్థ. మరోవైపు, గత ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వచ్చిన ఉద్యోగులు గత త్రైమాసికంలో పెరిగారు. సెప్టెంబర్ చివరినాటికి 2,500 మంది సిబ్బంది చేరడంతో మొత్తం 3,17,240కి చేరుకున్నారు. అలాగే ఉద్యోగుల వలసలు మాత్రం స్వల్పంగా పెరిగి 12.9 శాతానికి చేరుకున్నాయి.

- ప్రతిషేరుకు రూ.21 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ డివిడెండ్ రూపంలో రూ.46 చెల్లించింది.
- డాలర్ రూపంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4.8 శాతం ఎగబాకి 4.894 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.
- ఎబిటా రూ.8,649 కోట్లుగా నమోదైంది.
- కంపెనీ షేరు ధర 2.8 శాతం ఎగబాకి రూ.1,974.55కి చేరుకున్నది.

> *రెండో త్రైమాసికంలో ఆశాజనక పనితీరు కనబరిచాం. ఆర్థిక సేవల రంగానికి డిమాండ్ అధికంగా ఉండటంతో కరెన్సీ రూపంలో 3.1 శాతం వృద్ధిని సాధించాం. గత త్రైమాసికంలో 2.4 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది.*
>
> *- సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ*

పన్ను వసూళ్లలో భారీ వృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: పన్ను వసూళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన పదేండ్లలో పన్ను వసూళ్లు 182 శాతం పెరిగి రూ.19.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన టైమ్ సీరిస్ డాటాలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2014-15 నుంచి 2023-24 వరకు వసూలైనదాంట్లో కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రెండింతలు పెరిగి రూ.9.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అలాగే వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు నాలుగు రెట్లు పెరిగి రూ.10.45 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2014-15లో పన్ను వసూళ్లు రూ.6.96 లక్షల కోట్లుగా ఉన్నాయి. అలాగే ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య కూడా 4.04 కోట్ల నుంచి 8.61 కోట్లకు చేరుకున్నారు.

ఆ నవ్వులు చూస్తుంటే హ్యాపీగా ఉంది

'ఈ సినిమా విషయంలో దర్శకుడ్ని గుడ్డిగా నమ్మేశాను. నా నమ్మకాన్ని నిజం చేస్తూ మంచి రిజల్ట్ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనువైట్లకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. థియేటర్‌లో ప్రతి సన్నివేశాన్నీ ఆడియన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. వారి నవ్వులు చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది. ఇందులో చిన్నపాప సెంటిమెంట్ కూడా బాగా వర్కవుట్ అయింది. ప్రేక్షకులు ఓన్ చేసుకుంటే సినిమాను ఎంత దూరమైనా తీసుకెళ్తారని ఈ సినిమా నిరూపించింది.' అని గోపీచంద్ అన్నారు. ఆయన హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'విశ్వం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఈ నెల 11న సినిమా విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో గోపీచంద్ మాట్లాడారు. 'నా బలం కామెడీ అని అందరూ చెప్తారు. ఆ కామెడీనే ఈ సినిమా హిట్‌కి కారణమైంది. ఆడియన్స్‌కి ఈ సినిమా నచ్చడానికి ముఖ్య కారణాలు మదర్ ఎమోషన్, పాప ట్రాక్. వీటికితోడు మంచి యాక్షన్ ఉంది. కాబట్టే ఇంత విజయం దక్కింది. ప్రతి టెక్నీషియన్ ఈ సినిమా పెద్ద హిట్ కావాలని పనిచేశారు. గోపీచంద్ ఫ్రీడమ్ ఇచ్చి, సపోర్ట్‌గా నిలబడ్డారు. అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు కాబట్టే ఈ విజయం' అని శ్రీను వైట్ల చెప్పారు. ఇంకా నరేశ్, అనిషా అంబ్రోస్, పృథ్వీ, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్, డీవోపీ గుహన్, ఎడిటర్ అమర్ కూడా మాట్లాడారు.

శాసించడానికి వస్తున్న పుష్పరాజ్

దేశంలోని సినీ ప్రేమికులంతా విడుదలకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'పుష్ప 2' ఒకటి. అల్లు అర్జున్‌ని పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టిన 'పుష్ప'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే.. సరిగ్గా 50రోజుల్లో పుష్పరాజ్ మళ్లీ వెండితెరపై ప్రత్యక్షం కానున్నాడన్న మాట. ఈ సందర్భంగా బన్నీ మాసివ్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సింహాసనాన్ని అధిష్టించిన పుష్పరాజ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పుష్పరాజ్ రూల్‌కి కౌంట్‌స్టార్ట్ అయ్యిందని, ఇందులోని ప్రతి సన్నివేశం గూజ్‌బంప్స్ తెప్పిస్తుందని, ప్రేక్షకుల ఊహలకు అందని స్థాయిలో సినిమా ఉండబోతున్నదని మేకర్స్ తెలిపారు. దర్శకుడు సుకుమార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఏ విషయంలోనూ రాజీ పడకుండా సినిమాను తెరకెక్కిస్తున్నారనీ, తొలిపార్ట్‌ని తలదన్నేలా ఆయన టేకింగ్ ఉంటుందని, దేవిశ్రీ సంగీతం, మిరోస్లా క్యూబా బ్రోజెక్ ఛాయాగ్రహణం ఈ సినిమాకు హైలైట్ కానున్నాయని మేకర్స్ తెలిపారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు ఇతర పాత్రధారులు.

చిత్రం

సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఇటీవల రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లిలోని ఆయన నివాసానికి విచ్చేసిన సంతోష్‌కుమార్.. గాయత్రి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

జనరల్ జయేద్ మసూద్

'లూసిఫర్' (2019) చిత్రం మలయాళంలో మంచి విజయాన్ని సాధించింది. ఈ చిత్రానికి 'ఎల్2 ఎంపురాన్' పేరుతో సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. మోహన్‌లాల్ కథానాయకుడు. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించడంతో పాటు కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో మోహన్‌లాల్..అండర్‌వరల్డ్ డాన్ ఖురేషి అబ్రమ్ పాత్రలో కనిపించనుండగా, ఆయన రైట్ హ్యాండ్ అయిన జనరల్ జయేద్ మసూద్ పాత్రను పృథ్వీరాజ్ సుకుమారన్ పోషిస్తున్నారు. ఇటీవల ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

ప్రముఖ వ్యాఖ్యాత, నటుడు ప్రదీప్ మాచిరాజు హీరోగా, దర్శక ధ్వయం డుయో నితిన్, భరత్ దర్శకత్వంలో రూపొందుతోన్న లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌కు 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే పేరును ఖరారు చేశారు. మాంక్స్ అండ్ మంకీస్ నిర్మాణంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో దీపికా పిల్లి కథానాయిక. గురువారం టైటిల్ ప్రకటించి, ఫస్ట్‌లుక్, మోషన్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. గ్రీన్ బ్యాక్‌డ్రాప్‌లో దీపిక కళ్లలోకి చూస్తూవున్న ప్రదీప్ ఫస్ట్‌లుక్ పోస్టర్ వారిద్దరి పాత్రల కెమిస్ట్రీని ఆవిష్కరించింది. ఓ గ్రామంలోకి పనిమీద వచ్చిన సివిల్ ఇంజనీర్ అక్కడి అమ్మాయితో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత కథ ఎలాంటి మలుపు తీసుకుంది? అనేది మిగతా కథ. వెన్నెల కిశోర్, సత్య, గెటప్‌శ్రీను, మురళీధర్‌గౌడ్, రోహిణి, ఝాన్సీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: సందీప్ బొల్లా, సంగీతం: రథన్, కెమెరా: ఎం.ఎన్.బాలరెడ్డి,

దుష్టశక్తిపై పోరాటం

ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియడిక్ ప్రేమకథ 'ఆదిపర్వం'. మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రంలో ఆదిత్య ఓం, ఎస్తేర్, శివ కంఠమనేని కీలక పాత్రధారులు. సంజీవ్ మేగోటి దర్శకుడు. ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ '1974-90 మధ్య కాలంలో జరిగిన యదార్థ సంఘటనల సమాహారంగా ఈ సినిమాను రూపొందించాం. అమ్మోరు, అరుంధతి సినిమాల తరహాలో ఈ సినిమా ఉంటుంది. దుష్టశక్తికీ, దైవశక్తికీ మధ్య జరిగే పోరాటమే ఈ సినిమా. టెక్నికల్‌గా కొత్త అనుభూతిని కలిగించే సినిమా ఇది' అని తెలిపారు. సుహాసిని, శ్రీజిత ఘోష్, సత్యప్రకాశ్, సమ్మెట గాంధీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఎన్.హరీశ్, సహనిర్మాతలు: గోరెంట శ్రావణి, రవి మొదలవలస, ప్రదీప్ కాటకూటి, రవి దశిక, శ్రీరామ్ వేగరాజు, నిర్మాణం: అన్వికా ఆర్ట్స్, ఏఐ(అమెరికా ఇండియా)ఎంటర్టైన్మెంట్స్.

ఇండస్ట్రీ ధైర్యాన్నిచ్చింది

ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై అగ్ర కథానాయిక సమంత మరోసారి స్పందించింది. ఈ విషయంలో సినీరంగానికి చెందిన ఎంతో మంది ప్రముఖులు తనకు మద్దతుగా నిలిచారని చెప్పింది. కష్టకాలంలో వారు తనలో ధైర్యం నింపారని పేర్కొంది. ఆమె నటించిన తాజా వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత స్పందించింది. ఆమె మాట్లాడుతూ 'నా సినీ సహచరులు అందించిన మద్దతు వల్లే నేను ఈ రోజు ఇక్కడ ఆత్మవిశ్వాసంతో కూర్చున్నాను. ఇండస్ట్రీ వర్గాల ప్రేమ, వారికి నాపై ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. కష్టాలను అధిగమించడంలో వారు అందించిన ధైర్యం ఎంతో ఉపయోగపడింది. ఒకవేళ వారందరూ నాకు మద్దతుగా నిలవకపోతే ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా సన్నిహితులు, శ్రేయోభిలాషులు అందించిన ప్రేమ వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని సమంత పేర్కొంది. ఆన్‌లైన్ ట్రోలింగ్స్ గురించి తాను ఎక్కువగా పట్టించుకోనని, నెగెటివిటీకి దూరంగా ఉండేందుకు ఎప్పుడూ ప్రయత్నం చేస్తానని సమంత తెలిపింది. 'సిటాడెల్-హనీ బన్నీ' సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

'వేట్టయాన్'కు ప్రీక్వెల్ చేయాలి!

దసరా సందర్భంగా విడుదలైన సూపర్‌స్టార్ రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రం చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. సినిమా విజయాన్ని పురస్కరించుకొని చిత్ర దర్శకుడు టీజే జ్ఞానవేల్ మాట్లాడుతూ 'ఎన్‌కౌంటర్లు, న్యాయవ్యవస్థ చుట్టూ ఈ కథ నడుస్తుంది. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ హత్యల గురించి చాలా వార్తలు చదివాను. వాటిలో వాస్తవమెంత? అలా చేయడం కరెక్టేనా? అనే అంశాలను ఈ సినిమాలో చూపించాను. ఎర్రచందనం స్మగ్లర్లు అంటూ కట్టెలు కొట్టుకునే అమాయకుల్ని ఎన్‌కౌంటర్ చేసిన ఘటన నన్ను కదిలించింది. పేదలు మాత్రమే తరచూ ఇలాంటి ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారని, సంపన్నులు చట్టం నుంచి తప్పించుకుంటున్నారని నా పరిశోధనలో తెలిసింది. ఈ విషయాలన్నింటిని ఈ సినిమాలో చర్చించా' అన్నారు. రజనీకాంత్ అభిమానులు ఇష్టపడే అంశాలతో పాటు సామాజిక స్పృహ ఉన్న కథతో సినిమా తీశానని తెలిపారు. 'వేట్టయాన్'కు ప్రీక్వెల్ చేయాలనుకుంటున్నానని టీజే జ్ఞానవేల్ పేర్కొన్నారు.

మిస్టరీ థ్రిల్లర్ 'గగన మార్గన్'

విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ 'గగన మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకుడు. వి